క్లుప్తంగా

కన్నులపండువగా రావులమ్మ జాతర



రావులమ్మ తల్లి

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కన్నుల పండువలా నిర్వహించారు. అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

అయినవిల్లి: గ్రామదేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లికి సోమవారం జాతర వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు మొక్కులు చెల్లించారు. చలివిడి, బెల్లం పానకం, వడపప్పు నైవేద్యంగా భక్తులు అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని, అమ్మవారికి పుష్పాలతోను, విద్యుత్ దీపాలంకరణలో కనుల విందుగా అలంకరించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. మంగళవారం భారీగా తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలి



సేంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: సేంద్రియ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులతో ఎంతో మేలు జరుగుతుందని ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురులో సోమవారం రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను వారు పరిశీలించారు. క్రిమి సంహారక, రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో పండించిన పంటలతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రజల్లో ఆ దిశగా మార్పు రావాలని సూచించారు.

నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి



వక్కలంకలో ఉపాధి పని వివరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ఉపాధి హామీ పథకంలో పనులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఉపాధి కూలీలకు సూచించారు. ముక్కామలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బీమాను ప్రతి ఉపాధి కూలీ చేయించుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పనికి వచ్చే కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం పనుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గెద్దం అమ్ములు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నాయకులు జంపన బుజ్జిరాజు, సఖినేటిపల్లి మండలం ఎంపీపీ వీర మల్లిబాబు, అంతర్వేదిపాలెం సర్పంచ్ నల్లి లీలావతి, సఖినేటిపల్లి మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ ఆరేపల్లి సత్యనారాయణ, తాడి సహదేవ్ పరామర్శించారు.

అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన

కొత్తపేట: స్థానిక కార్పొరేషన్ సత్రం ఆవరణలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉప సర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దర్నాల రామకృష్ణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు తమ్మన సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌తో లాభాలెన్నో..

- అసంఘటిత కార్మికుల నమోదుకు అవకాశం
- పోర్టల్‌పై అవగాహన అవసరం



రావులపాలెం లో ఈ-శ్రమ్ పథకంలో నమోదు చేసి కార్డును కార్మికులకు అందిస్తున్న అధికారులు

రావులపాలెం: కేంద్ర ప్రభుత్వం అసంఘటిత, వలస కార్మికులకు సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ-శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకానికి గ్రామస్థాయిలో అధికారులకు ఆశించినంతగా స్పందన కానరావడం లేదు. ఈ-శ్రమ్ పథకంలో అసంఘటిత రంగ కార్మికులకు ప్రయోజనం కల్పించేందుకు అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై అవగాహన లేక పలువురు కార్మికులకు వారికి అందాల్సిన లబ్ధికి దూరమవుతున్నారని అధికారులు చెబుతున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట, ఆత్రేయపురం మండలాల్లో ఈ-శ్రమ్ నమోదుకు అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో సుమారుగా 80 వేల మందిని ఈ పథకం పరిధిలోకి తీసుకురావడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు సుమారుగా 50,386 మందితో 62.98 శాతం మేర మాత్రమే నమోదైనట్టుగా అధికారులు చెబుతున్నారు.

60 సంవత్సరాలలోపు వారు అర్హులు

16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయం పన్ను పరిధిలోకి రాని వారు ఈ-శ్రమ్ పథకానికి అర్హులు. ఈ పథకంలో నమోదైన వారు వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించని వారు కూడా ఈ పథకానికి అర్హులు. భవన నిర్మాణ కార్మికులు, వడ్రంగి, ఉపాధి హామీ కూలీలు, మత్స్యకారులు, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, టీవీ మెకానిక్స్, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్స్ ఇతర చేతివృత్తుల వారు, వాహన చోదకులు, వీధి వ్యాపారులు, సేవా రంగంలో ఉన్న వారు, వివిధ దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేందుకు అర్హులు.

రెండు రకాల ప్రయోజనాలు

ఈ-శ్రమ్ పథకంలో నమోదు చేయించుకున్న కార్మికులకు రెండు రకాల ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు ఆర్థికసాయాన్ని అందిస్తారు. ప్రమాదంలో అంగవైకల్యం ఏర్పడితే వైకల్య శాతాన్ని బట్టి రూ.లక్ష వరకు ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. కార్మికుల భద్రత కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకంలో కార్మికుల పేర్లు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. వలస కార్మికులు ఎవరైనా ఎక్కడైనా ఈ-శ్రమ్ కార్డు నమోదు చేయించుకోవచ్చు. ప్రాంతంతో సంబంధం లేకుండా నమోదు చేయించుకోవచ్చు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానించిన సెల్ నంబర్ దగ్గర ఉంచుకుంటే నమోదు చేయించుకోవచ్చు. నామినీ ఆధార్ కార్డు కూడా లబ్ధిదారుడు దగ్గర ఉంచుకుని, వివరాలు నమోదు చేయించుకోవాలి. ఈ-శ్రమ్‌లో పేరు నమోదుకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జెరాక్స్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్, బ్లడ్ గ్రూపు వివరాలు, నామినీ ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అవసరమవుతాయి. ఫోన్ నెంబరు లేని వారు వేలిముద్ర వేయాలి. సమీప గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) లేదా కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు పూర్తయిన అనంతరం యూఏఎన్ నంబర్‌తో గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

భవిష్యత్తులో అందరికీ ఉపయోగం



ఈ-శ్రమ్ పథకంలో ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవడం వలన భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ-శ్రమ్ నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులకు కలిగే ప్రయోజనాలను అవగాహన సదస్సుల్లో వివరిస్తున్నాం. కోనసీమ జిల్లాలో 4,44,554 మంది కార్మికులు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకూ 2,88,568తో 65.06 శాతం జిల్లా వ్యాప్తంగా నమోదు చేసుకున్నారు. మిగిలిన వారు కూడా ఈ-శ్రమ్ పథకంలో నమోదు చేయించుకోవాలి

– టి.నాగలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, అమలాపురం

108 కలశాలతో శోభా యాత్ర



శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా విశేషాలంకరణలో సీతారామచంద్రస్వామి

అయినవిల్లి: అయినవిల్లిలంక సీతారామచంద్ర స్వామివారి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా సోమవారం 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. వేదపండితులు సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మహా సుదర్శన అనుష్ఠాన పూర్వక మహా సుదర్శన హోమం, అనంతరం పవిత్ర గోదావరి నదీజలం, సప్తనదీ జలం సంగ్రహణం, గోమాతతో 108 కలశలతో గ్రామ ప్రదక్షిణ పూర్వక శోభాయాత్ర, అష్టోత్తర శత కలశ ఆసాదనం, అష్టోత్తర శత కలశ ద్రవ్య దేవతారాధనం, స్వామివారి పంచశయ్యాధివాసం, హౌత్ర ప్రశంసనం వంటి విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణాన్ని, స్వామి, అమ్మవారిని వివిధ పుష్పాలు, కొబ్బరి కాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

దళితులపై కూటమి కక్ష కట్టింది



వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: దళితులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని, దళిత వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందుతున్నాయనే ఉద్దేశంతో రాజకీయంగా ఎదుగుతున్న నందిగం సురేష్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో జరిగిన సమావేశంలో గొల్లపల్లి పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపైన, సోషల్ మీడియా యోధులపైన లేనిపోని అక్రమ కేసులు పెట్టి జైల్లో బంధించి ఆనందపడుతున్నారని, ఈ ఆనందం ఎంతకాలమో ఉండదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని మరచి కేవలం కక్ష సాధింపులకు దిగుతుందని, దానిలో భాగంగానే దళితుల్లో ఎదుగుతున్న నందిగం సురేష్‌పైన మిగిలిన దళిత నాయకులపైన తప్పుడు కేసులు పెట్టి హింసిస్తూ శునకానందం పొందుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, తాము అండగా ఉంటామని అభయమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన వివిధ వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు తెన్నేటి కిషోర్, మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, జిల్లెల్ల ఉదయ్ కిరణ్, నియోజకవర్గ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ముచ్చుల వెంకట్రావు, కూనపురెడ్డి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవి రెడ్డి, విశ్వేశ్వరాయపురం గ్రామ శాఖ సెక్రటరీ పెయ్యల చిట్టిబాబు, గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ మాస కల్యాణం



బాలబాలాజీ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి మాస కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో కర్తలుగా పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి వారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన రంబా చంద్రశేఖర్, రమ్య దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తికి అందజేశారు. దాతకు పర్యవేక్షకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అధ్వాన రహదారిని అభివృద్ధి చేయండి



అంబాజీపేటలో ఫిర్యాదు చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: స్థానిక బేతాళ స్వామి ఆలయం నుంచి పోతాయిలంక వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని దానిని అభివృద్ధి చేయాలని నాగవరపు నాగరాజు, మట్టా వెంకటేశ్వరరావు, మైలా ఆనందరావు, ఉందుర్తి నాగబాబులు అధికారులను కోరారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఏఓ నరసింహమూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదని, గుంతలు ఏర్పడి బాటసారులకు, వాహనదారులకు, రైతులకు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భారీ గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలో చప్పిడివారిపాలెం, కోలివారి అగ్రహారం, కుమ్మరిపాలెం, నందెపువారిపాలెం, పెచ్చెట్టివారిపాలెం వారు వెళ్లేందుకు ఈ రహదారినే వినియోగిస్తారని, అధ్వానంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే అధ్వాన రహదారిని అభివృద్ధి చేయాలని దరఖాస్తులో పేర్కొన్నారు.

వరి ఊడ్పుల సమయంలో ఉపాధి పనులు ఆపాలి

అంబాజీపేట: వరి ఊడ్పులు, కోతల సమయంలో ఉపాధి హామీ పనులను నిలుపుదల చేసి రైతులకు సహకరించాలని కోనసీమ శాఖ బీకేఎస్ నాయకులు అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ వినతిపత్రం అందజేశారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు, ఏప్రిల్ 1 నుంచి మే 15 వరకు ఉపాధి పనులు నిలుపుదల చేయాలన్నారు. ఈ తేదీల్లో వరి రైతులకు కూలీలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులకు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉప్పుగంటి భాస్కరరావు, చేకూరి సూర్యనారాయణరాజు, కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



మానేపల్లి చానల్‌లో జేసీబీతో పూడికతీత పనులు

మామిడికుదురు: డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా కేటాయించిన నిధులు మొత్తం రూ.26 లక్షలతో మామిడికుదురు మండలంలో పంట కాలువల్లో పూడికతీత, వాల్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులను రెండు చోట్ల యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. మరో రెండు పనులు చేపట్టాల్సి ఉంది. పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి పాశర్లపూడి వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర పంట కాలువలో పూడికతీత పనులకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అయిదు కిలోమీటర్ల మేర పనులను పూర్తి చేశామని ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ తెలిపారు. మిగిలిన పనులు కూడా రెండ్రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. మగటపల్లి నుంచి గోగన్నమఠం వరకు మూడు కిలోమీటర్ల మేర పంట కాలువ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేక గ్రాంటు నుంచి రూ.మూడు లక్షలు మంజూరు చేశారు. ఈ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. మామిడికుదురులో దెబ్బతిన్న పంట కాలువ గట్టు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఏఈ తెలిపారు. దీంతో పాటు ఎనిమిది కిలోమీటర్లు పొడువు ఉన్న మామిడికుదురు, లూటుకుర్రు, మాకనపాలెం పంట కాలువ అభివృద్ధి పనులకు రూ.మూడు లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం రిటైనింగ్ వాల్, కాలువ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వీటిని కూడా త్వరలోనే చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.


వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



రాంబాబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మట్టపర్తి రాంబాబుకు రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు. ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త, చల్లా ప్రభాకరరావు స్పందించి ఆ యువకుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలను సోమవారం అందజేశారు. రాంబాబుకు వైద్యం అందించేందుకు లక్షలాది రూపాయల వ్యయం అవుతుండటంతో ఆ కుటుంబసభ్యులు దాతలను ఆశ్రయిస్తున్నారు. అందులో భాగంగా స్పందించిన దాత ప్రభాకరరావుకు రోగి రాంబాబు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి సాయం పంపిణీ



ముక్కామలలో దుర్గాభవానికి సాయం అందిస్తున్న మల్లిబాబు

అంబాజీపేట: పదిలో 500 మార్కులు సాధించి, కొత్తపేట ప్రభుత్వ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో చేరిన సాకా దుర్గాభవానికి సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి కుమారుడు బండారు మల్లి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో 500 మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులు ఐదుగురిని సోమవారం ఘనంగా సత్కరించారు. చదువుపై మక్కువ ఉన్న దుర్గాభవాని ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో తనకు మల్లిబాబు ఆర్థికసాయం అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలు నిలిపివేయాలి



నార్కెడిమిల్లిలో సెక్రటరీకి వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలోని నార్కెడిమిల్లిలో జనావాసాల సమీపాన చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని ఆ గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ముత్యాల రామకృష్ణ, బొలుసు సూరిబాబు, ఎస్.పాపారావు, వై.దుర్గాసాయి, యడ్ల నాగేశ్వరరావు సహా సుమారు 80 మంది గ్రామస్తులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు, గ్రామ పంచాయతీ సెక్రటరీకి సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. ఆ నకళ్లను విలేకరులకు అందజేశారు. తమ నివాసాలకు దగ్గరలోనే ఉన్న భూమిలో అనగా సర్వే నంబర్ 145/4లోని 1.56 ఎకరాలతో పాటు ఇతర భూములను కలుపుకొని చెరువుల తవ్వకానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తమ ఇళ్లకు దగ్గరగా చెరువులు తవ్వడం వలన మా జీవనానికి ఇబ్బంది కలుగుతుందని, ఆరోగ్యాలు పాడవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల తవ్వకాల నిలుపుదలకు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

కుమ్మరి కాలువ లాకు షట్టర్లకు మరమ్మతులు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అమలాపురం రూరల్: కుమ్మరి కాలువ లాకు షట్టర్లు పాడైపోవడంతో ఉప్పునీరు తమ పొలాల్లోకి రావడంతో పంటలు నష్టపోతున్నామని అమలాపురం మండలం పేరూరుకు చెందిన రైతులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో ముంపు సమస్య ఉందన్నారు. అధికారులు చొరవ చూపి దాదాపు 100 ఎకరాల వరి చేలను ఉప్పు నీటి ముంపు నుంచి కాపాడాలని రైతులు కోరారు. రైతు దేగల వెంకటరమణ ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. లాకులకు వెంటనే మరమ్మతులు చేయించాలని, కుమ్మరి కాలువ, మేక కాలువ వంతెన నుంచి గంటా వారి తూము వరకు మురుగు కాలువలోని గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు దూనబోయిన గణేశ్వరరావు, జల్లి శ్రీను, ఎస్.సత్యనారాయణ, దూనబోయిన ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



నంగవరంలో గడ్డివామి మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉప్పలగుప్తం: నంగవరం గ్రామంలో పాడి రైతు శీలం సత్యనారాయణకు చెందిన 6 ఎకరాల గడ్డివామి అగ్నిప్రమాదానికి గురై కాలిబూడిదైంది. ఆదివారం అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు అంటించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మంటలు చెలరేగుతున్న సమయంలో చుట్టుపక్కల ప్రజలు గగ్గోలు పెట్టడంతో ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారన్నారు. భారీ వ్యయంతో పశువులకు గ్రాసాన్ని నిల్వ చేసుకున్నామని రైతు తీవ్ర ఆందోళన చెందాడు.

చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జాన శంకరరావు

సఖినేటిపల్లి: చేనేత సహకార సంఘాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చేనేత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సఖినేటిపల్లి మండలం మోరిలో సోమవారం చేనేత విభాగం నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు జాన శంకరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాకం వల్ల చేనేత వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేదా పాలక మండలి నియమించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక కార్పొరేషన్లకు పాలక మండలి నియమించి దేవాంగ కార్పొరేషన్‌కి పాలక మండలి ఏర్పాటు చేయకపోవడంతో.. దేవాంగులపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. చేనేత వర్గంలో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మిగతా చేనేత కార్పొరేషన్లను ప్రకటించకపోవడం దీనికి తార్కాణమన్నారు. అలాగే దేవాంగ కార్పొరేషన్ పాలక మండలిని వెంటనే నియమించాలని కోరారు. ఆప్కో చైర్మన్‌ని నామినేట్ చేసి ఇంతవరకు జీఓ ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకున్నారనీ, ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు ఇనుమర్తి వీర నాగరాజు, నాయకులు కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, చింతా సుధాకర్, లక్కింశెట్టి వీవీ సత్యనారాయణ, రామారావు, కందనాల ముత్యాల రావు, బట్టు దుర్గారావు, లక్కింశెట్టి ఏసు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు నలుగురికి గాయాలు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన అవర్తనం కారణంగా సోమవారం కురిసిన భారీ వర్షంతో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు జి.వేమవరం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న చింతపల్లి నాగేశ్వరరావు, చింతపల్లి సూర్యనారాయణ, కట్టా సూరిబాబు, దుర్యోధనుల నారాయణమూర్తి వర్షం కురవడంతో ఓ ట్రాక్టర్ ట్రక్కు వద్ద నిలుచున్నారు. ఆ సమయంలో భారీ శబ్దంతో సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడింది. దీంతో వారికి షాక్ తగిలి గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వారు తాటిచెట్టు కింద ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: స్థానిక కాపు కల్యాణ మండపం సమీపంలో షిర్డీ సాయి బాబా గుడివద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ తెలిపిన వివరాల ఇంజరం పంచాయతీ గోపులంకకు చెందిన కాకర్లపూడి గోపాలకృష్ణంరాజు రహదారి దాటుతుండగా మోటార్ సైకిలిస్టు ఢీకొనడంతో కాలు విరిగింది. స్థానికులు క్షతగాత్రుడిని యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.